("స్వాతి" మాసపత్రిక; మార్చి 1979?)

వై- శ్వానర-భోగం

అరగంటయింది బ్యాంక్ తలుపేసేసి.

ఇవతలికొచ్చేవాళ్ళు నోట్లకట్టలు నిండిన హ్యాండ్‌బ్యాగులతో బ్రీఫ్‌కేసులతో, రుమాళ్ళతో. జేబులతో ఏజెంటు గారి రూమ్‌లోంచి వస్తున్నారు. లోపలికి ఎవరూ వెళ్ళేప్రసక్తేలేదు.

"అవదంటారా నర్సింహారావుగారూ?"

"మీకెందు కలాగుండండిచెప్తాను!" అని పదోసారికాబోలన్నాడు. ఆర్, అండ్ బి. ఆఫీసు గుమస్తా నర్సింహారావు. అతని చేతుల్లో వున్నాయి నాలుగు లక్షల రూపాయల విలువగల నా బిల్లులు అనాడు.

"రేపుకదా ఏప్రిల్ ఫస్టు? వీళ్ళు మనన్ని ఇవాళ్టినుంచే ఫూల్ చేస్తున్నారేమిటి ఖర్మ?" అని జోకుతో మళ్ళా అశాంతిని వెలిబుచ్చాను-

"ఏంటండి కంట్రాక్టరుగారూ!ఇవాళకింక మూసిన బ్యాంక్ తెరవనట్టేనా?" పక్కనుంచి ఎవరో అడిగారు. తిరిగి చూశాను. అతని పేరు మరిచిపోయాను. ఎలెక్ట్రిసిటిబోరు ఎస్. ఈ. ఆఫీసులో యూడిసీ.

"మీరొచ్చేరేమండి కాష్‌కి? ఇవాళ వేంకట్రావుగారి పేర్న ఎండార్స్ చేస్తామన్నారే మా బిల్లులు?" అన్నాను.

"అక్కడా ముప్ఫైయారువేలదాకా రావాలి.... "అందరికంటె తక్కువ బిల్లు సార్ మీది! మీరు రేపురండి, పేమెంటుకి. ఇవాళ కోటిరెడ్డిగారిదీ జంబునాథన్‌గారిదీ, ఇంకా కొందరిదీ, మొత్తంపదహారులక్షలకిపైగా వున్నాయి, అని చెప్పేరు వెంకట్రావుగారు ఈ ఉదయం. దానికి" నేను—" బాబ్బాబూ— ఆ బిల్లులతోపాటు నాదీ మీపేర్నే వేసుకోండి. నాకు సొమ్ము యివాళ రాత్రికే కావాలి" అని మొరపెట్టుకొని మొత్తానికి ఆయన్ని వొప్పించేను.

"మీబిల్లు ఆయన పేరనే వుంది."

"మరి ఆయన కనిపించరే?"

"ఆయన మళ్ళీ ఆఫీసుకెళ్ళేరు."

"అసలు బ్యాంకు కొచ్చినట్టు కనబడదే?"

"బ్యాంకుదాకా రాలేదు. జంబునాథన్‌గారి మూడు బిల్లుల్లో వొకదాని మీద ట్రెజరీలో అబ్జక్షన్ పడింది- అది పట్టుకుని మళ్ళీ ఎస్. ఈ. గారి సంతకాలకోసం వెళ్లారు."

"మిగతావి పాసయ్యాయా? వాట్లో నా బిల్లుంది" అన్నాను.

"మిగతావి పాసయ్యాయి. అవీ వెంకట్రావు దగ్గరే వున్నాయి"

పాస్‌కాని బిల్లుకోసం అయిన బిల్లులుకూడా ఆఫీసుకి పట్టికెళ్ళడమేమిటండి; మరీ అన్యాయం కాకపోతే!" అని విసుక్కున్నాను.

"బిల్లులేమో ఆయనదగ్గి రుండిపోయాయి. బ్యాంకువాళ్ళేమో తలుపులు మూసేసుకున్నారు. ఆయన వొచ్చే దెప్పుడు, ట్రెజరీలో పాసయ్యేదెప్పుడు; బ్యాంకులో ప్రెజెంట్ చేసేదెప్పుడు; కేషయ్యే దెప్పుడు?" అనికూడా అనేశాను.

0 0 0

ప్రతి యేడూ మార్చి 31 నాడు ఠంచన్‌గా మధ్యాహ్నం రెండుగంటలకి బ్యాంకు తలుపులు మూసెయ్యరు, లక్షలకొద్దీ రూపాయల బిల్సు ఆరోజు కాష్ అవుతాయి. అవి ఉద్యోగుల జీతభత్యాలూ కావచ్చు. కాంట్రాక్టర్ల బిల్సు కావచ్చు. కంటింజెన్సీలు కావచ్చు.

పీకలమీది కొచ్చేకాదా బిల్లులు తయారుచెయ్యక ఏంచ్చేస్తారో- అనుకునే వాణ్ని— మా నాయనగారు కాంట్రాక్టులు చేసిన రోజుల్లో-

గుమస్తాలదీ కాదు తప్పు; అధికారులదీ కాదు.

ఎన్నో శాంక్షన్లు మార్చి 20 నుంచి 28 వరకు గల దినాల్లో వస్తాయి. కొన్ని 29.కూడా వస్తాయి!.........మార్చి 24 ప్రాంతంనుంచి రాత్రీ పగలూ నిప నేసి, బిల్లులు తయారు చేస్తారు గుమాస్తాలు; వాటివల్ల ఎవరికి లాభమో వాళ్ళని తిట్టుకుంటూనూ, అందులో వాళ్ళ సహాధ్యాయులే వుంటారు. స్వంత అధికార్లే వుంటారు. నాలాంటి కాంట్రాక్టర్లూ వుంటారు.

ఎవరికీ తప్పవు తిట్లు.

ఐతే ఎవరి బిల్లూ ఆగిపోదు.

ఎందుకంటే మార్చి 31న ట్రెజరీ ఆఫీసు మూసెయ్యరు. బ్యాంకు తలుపులూ మూసెయ్యరు. తయారైన బిల్లులు సంతకాలై ట్రెజరీకి వెళ్ళడమూ, గడుగా మారడమూ జరుగుతాయి.

ఒకో ఏడాది- ఏప్రిల్ 1న తెల్లారే వరకు బ్యాంక్ పని చేస్తూనేవుంటుంది.

శాంక్షన్‌లు ముందుగా పంపడానికి 'ఫండ్స్' వుండవు. సెంట్రల్ గవర్నమెంటు గ్రాంటో, అప్పో మార్చి 15 దాకా రాదు. ఆ తరువాత హైదరాబాదు సెక్రటేరియట్లో ఆ యా డిపార్టుమెంట్ల అధికారులు. "ఆర్థికశాఖ కంకరెన్స్"తో శాంక్షన్లు విడుదల చెయ్యడం అక్కణ్ణుంచి జిల్లాలకి డిస్ట్రిబ్యూషన్ స్టేట్ మెంట్ల కాపీలు రావడం, ఇన్నీ అయినా డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ద్వారా జిల్లా ట్రెజరీలకి విడిగా వాటి కాపీలు రాకపోతే బిల్లులు ట్రెజరీలో పాస్ కావు.

అయితే ఏదీ ఆగిపోదు. అలా అలా ఆ అర్డర్సు 31 మధ్యాహ్నం మూడు గంటలకి వొచ్చినా, ఏ బిల్లూ వదలకుండా అన్నీ ప్యాస్ చేసేస్తారు ట్రెజరీ వారు. అన్నిటికీ కేష్ యిస్తారు బ్యాంక్‌వారు.

ఏప్రిల్ ఫస్టు ఉదయం వరకు యిచ్చినా సరే, ఆ బిల్లులన్నీ మార్చి 31 డేబుక్‌లోకే వెళతాయి. ఏప్రిలుఫస్టున, ఆ తరువాత–పాత ఆర్థిక సంవత్సరపు శాంక్షన్ల బాపతు బిల్లులకు కేష్ యివ్వరాదు,

ఈ ఏడాదీ అంతా సవ్యంగానే అయిపోతుందనుకున్నాం.

అయితే–రాష్ట్రం మొత్తంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మొన్నటికి నాలుగు నెలలపాటు గుమాస్తాలు లేకుండా నడిచాయి. నూటపదహారు రోజులు సమ్మెచేసి మార్చి 26 న ఉద్యోగులు తిరిగి డ్యూటీల్లో చేరారు.

మూడు నెలలనుంచీ జీతాలు లేక ఆవురావురని వున్నారేమో, ముందు వాళ్ళ జీతాలు బిల్లు చేసుకున్నారు. "మా బిల్సు సంగతేమి"టని అడగడానికి కూడా నోరు రాలే దెవరికీనీ.

అక్కడికి 28 అయింది. మూడు నెలల జీతాలు పట్టుకుని ప్రతి చిన్న గుమాస్తా, పెద్ద గుమాస్తా, హెడ్ గుమాస్తా, సూపరింటూ, మేనేజరు–28న ఇళ్ళకు వెళ్ళి ఇంటి చుట్టూనూ, వూరు నలుమూలలానూ వున్న అప్పులు నిష్పత్తీ అనుపాతం చూసుకుని నివాడా చేసుకున్నారు.

29 ని వాళ్ళు పన్లోకొచ్చినా మధ్యాహ్నందాకా ఎవరెవరికి ఎంతెంత అప్పు మిగిలిపోయిందో చర్చించుకోడంతోనే సరిపోయింది,

29 రాత్రి, 30 పగలూ రాత్రీ, 31 పగలు–ఇళ్ళకి వెళ్ళకుండా బిల్లులు తయారుచేసి వాటికి అవసరమయిన ఇతర కాగితాలు జతపరచి, సంతకాలు పెట్టించుకుని–ఒక మహాసంప్రదాయాన్ని తు–చ–తప్పకండా అచరించారు గుమాస్తాలు. వారికి జోహార్లూ; వందనాలూ ఎన్ని అర్పించినాచాలవు....

కాని ఈ బిల్లులన్నీ ఇవాళ కేష్ కాకపోతే-
వాళ్ళకి మేం అవికూడా అర్పించం
మా అప్పులే తీరవు, సరి...

* * *

చొరవ చేసుకుని ఏజెంటుగారి రూమ్‌లో దూరాను. మెసెంజరు నన్ను అడ్డుతూ పడ్డ చిరాకు ఆయన కళ్ళపడ్డాది, "ఆయన్ని రానివ్వవోయ్; అప్పా రావూ! ఆయన వేరేపనిమీద వొచ్చుంటారు." అన్నారు ఏజెంటుగారు; నన్ను కూర్చోమని సంజ్ఞచేసి; హెడ్‌క్యాషియర్ తెచ్చిన స్టేట్‌మెంటు ఏదో టిక్‌చేస్తూ.

నేను చిరునవ్వు మొహాన పులుముకుని "సారీ సార్. నేను వేరేపనిమీద రాలేదు. అదేపనిమీద వొచ్చాను. నావి ఐదు లక్షల రూపాయలు వుండిపోయాయి ఈ ఏడాది. ఖర్మేమిటోగాని అన్నీ తలుపవతలే వున్నాయి" అన్నాను.

"అరరే-అలాగా? సా-రీ-"

సా-రీ-అనడంలో "సరి" అన్నారో తెలీలేదు; 'సారీ' అన్నారో తెలీలేదు.

తమరు పర్మిట్ చేస్తే-ఎ. పి. ఎస్. ఈ. బీ. నుంచి ఇద్దరు; ఆర్.అండ్ బి నుంచి వొకరు-జడ్, పి. నుంచి ఒకరు-మూడోకంటివాడికి తెలీకండా లోపలి కొస్తారు సార్" అన్నాను.

"అబ్బెబ్బే-అదెలా కుదుర్తుంది? అలాంటప్పుడు మీరు ముందే జాగర్త పడుండాల్సింది. నా పీకలమీద కొస్తుంది అలాంటి పన్లు చేస్తేను. వెళ్ళండి వెళ్ళండి——" అని ఆయనలేచి నిలబడిపోయాడు.

మెసెంజర్ అప్పారావు నావేపు పొగరుగా చూశాడు.

"కలెక్టరుగారు రాయలేదా సార్, బ్యాంక్ తెరిచుంచమని?" అన్నాను లోపలవున్న నూటయిరవైమందికాక, పైనున్న రెండువందలమందినీ, ట్రెజరీలో గిరికీలుకొడుతున్న యాభైమందినీ తలుచుకుని,

"కలెక్టరుగారు రాయలేదు; ఫోన్ కూడా చెయ్యలేదు. కనీసం మేం ఫోన్ చేస్తే ఆన్సర్ చెయ్యడంలేదు."

అంటే-కలెక్టర్‌గారేం చేస్తున్నట్టు?

ఎనభైలక్షల రూపాయల బిల్సు ఇవాళ ఎన్‌కాష్ కావాలని ఆయనకి తెలుస్తుంది. ఇటువంటి సమయంలో ఆయన మౌనం వహించడం కష్టంగా ఉంది. మాయమైపోడం దుస్సహంగా ఉంది.

ఈ శాంక్షన్‌లన్నీ "కుక్క" ముట్టేసుకుంటే మళ్ళీ కొత్తశాంక్షన్లు అక్టోబర్ దాకా రాకపోవచ్చు. పెట్టిన డబ్బంతా వర్క్సులో లాకప్ అయిపోయి వుండిపోయింది. కొత్తవర్క్సు ఎలా చేపట్టగలం? ఎప్పుడూ ఎవరికీ లోటుచెయ్య లేదు....ఇలా ఎందుకు జరుగుతోంది?

"కలెక్టర్‌గారు ఆఫీసులో లేనట్టున్నారు సార్."

"నాకు తెలీదు. మీరు వెళ్ళండి. ఐయామ్ బిజీ" అన్నారు బ్యాంక్ ఏజెంటుగారు.

*　　　　*　　　　*

"ఎవ్వరూ వెళ్ళిపోకండి. అరగంటలో వస్తాను" అని, నా బిల్సు పట్టుకున్న గుమస్తాలిద్దర్నీ వుద్దేశించి చెప్పినా, అందరికీ వినపడేలాగే చెప్పేను.

కారు తీసుకుని బైల్దేరాను, కలెక్టరుగారి బంగళాకి.

*　　　　*　　　　*

"గవర్నమెంట్ వెహికిల్" అని రాసివున్న జీపులు పది, పన్నెండు దాకా వున్నాయక్కడ.

సంగతేమిటో అడుగుదామని, ఎవరైనా కనిపిస్తారేమోనని వెతికాను. అందరూ లోపలెక్కడో వున్నట్టున్నారు. ఆ నిశ్శబ్దం భయంకరంగా వుంది.

కలెక్టర్‌గారు కులాసాగా ఉన్నారా? హఠాత్తుగా ఆయనకేదైనా సుస్తీ చేసిందా అని అనుమానం వొచ్చింది.

ప్రస్తుతం యీ జిల్లాకి కలెక్టర్‌గా వున్న సూర్యంగారూ, నేనూ భీమవరం కాలేజీలో క్లాస్‌మేట్సుం. ఆయన యిక్కడికి రాకపూర్వం వివిధ వుద్యోగాలలో వుండే కాలంలో నేను వార్ని అప్పుడప్పుడు కలుస్తూనే వున్నాను.ఎంత పన్లో ఉన్నాసరే, "హలో, వొచ్చావా! రా, కూర్చో. ఎలా వుందినీ పని? పిల్లలు బావున్నారా?" అని పలకరించడం రివాజు.

ఎక్కడో లోపల వున్నట్టున్నారాయన.

ముందు హాల్లో అడుగుపెట్టాను.

ఇరవై చేతులుంటే బాగుణ్ణు రావణాసురుళ్ళాగ-అనిపించింది, జీవితంలో తొలిసారిగా—

అక్కడ-

ఆర్. డి. ఓ.గారు-

డి. ఎం. ఓ. గారు-

జాయింట్ కలెక్టరుగారు–

తాసీల్దార్ గారు–

డిస్ట్రిక్టు వెటెర్నరీ ఆఫీసర్ గారు–

సి. టి. ఓ. గారు.

హుజూరు శిరస్తాదారుగారు–

కలెక్టర్ గారి పి. ఏ, గారు–

సెటిల్మెంటు ఆఫీసర్ గారు–

డి. సి. టి. ఓ గార్లు యిద్దరు–

సర్వే అసిస్టెంటు డైరెక్టరుగారు–

కో–ఆపరేటివు జాయింటు రిజిస్ట్రారు గారు–

ల్యాండ్ అక్విజిషన్ డిప్యూటీ కలెక్టరుగారు–

పి. డబ్ల్యు. డి. సూపరింటెండింగు ఇంజనీరుగారు.

జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ గారు–

సివిల్ సప్లయిస్ ఆఫీసర్ గారు–

అందరూ మహానుభావులే!

ఎందరికని వందనాలు,

రెండంటే రెండుచేతులతో?

అయితే గొప్ప సంతోషపడిపోయాను; బ్యాంకుదగ్గిర పరిస్థితి తల్చుకుని.

వీళ్ళందరూ తమ తమ ఆఫీసుల్లో ఈ మూడురోజులూ తయారైన బిల్లులు బ్యాంకుదగ్గిర ఆగిపోయాయని చెప్పుకోడానికే ఇక్కడికి వొచ్చుండొచ్చు అన్న మాట స్ఫురించింది.

అసలు మాబోటి కాంట్రాక్టర్లకే ఎక్కువ నష్టం–ఈ పరిస్థితివల్ల.

అప్పు– మొత్తం ఎనభై లక్షలుంటుంది; రావలసిన సొమ్ము. ఏడెనిమిది నెలలపాటు ఈ సొమ్ము రాకపోతే అందరికీ కలిపి మొత్తం పడ్డీల రూపేణా నష్టం దాదాపు పదమూడు లక్షలు....ఐనా. బ్యాంకు తెరిచివుంచే ఏర్పాటు చెయ్యమని అడగడానికి మాబోటి కాంట్రాక్టర్లకి నోరెక్కడిది?

అడిగితే అధికారులే అడగాలి–

వారూ వారూ ఒకటి....

అరనిమిషంపాటు చిరునవ్వుతో అందర్నీ పలకరించేను; ఒక చెయ్యీ రెండుచేతులూ పైకెత్తుతూ, జోడిస్తూ....

వారందరూ చేతులెత్తి రిసీవ్ చేసుకుంటున్నారేకాని; చిరునవ్వులైనా ప్రసాదించరేం? అని దిగులుపడ్డాను.

సమాధానానికన్నట్టు పక్కపరండాలోంచి ఫోన్ సంభాషణ వినబడింది.

"హలో-నేను కలెక్టరుగారి క్యాంప్ క్లర్కుని మాట్లాడుతున్నాను-అక్కడ పొజిషనంతా బావుందా? ఆఁ ఆఁ బయల్దేరుతున్నారు కలెక్టర్ గారు....శవదహనానికి అన్ని ఏర్పాట్లూ జరిగాయా? ఓకే-ఇదుగో, బయల్దేరేడమే...."

నిర్ఘాంతపోయాను-"శవదహనం" అన్నమాట విని.

ఇప్పుడర్థమైంది-నా నమస్కారాలకి ఈ అధికారులంతా ఎందుకు ముభావంగా తలలూపి వూరుకున్నారో-

కాని-ఎవర్నడిగినా బావుండదు,

తెలుసుకోకపోవడం నా పొరపాటే.

కాసిని బిల్స్ కేష్కాలేదని-నా ఆదుర్దాలో నేనున్నాను-కాని జరిగిపోయింది మహాఘోరం!

*　　　*　　　*

"అందరూ లేవాలి సార్"

దఫేదారు నెమ్మదిగా అయినా ఖచ్చితంగా చెప్పేడు; హాలుద్వారం దగ్గిర కనబడి——

స్విచ్చినొక్కితే మోటారు కదిలినట్టు అందరూ లేచారు. "ఇటు——" అంటూ అందరిమధ్యనించీ నడుచుకుంటూ, హాలుకి ముందువేపున్న ద్వారంలోంచి బయటికి నడిచాడు.

అందరూ కలెక్టరుగారి మాటని "ఫాలో" అయినంత విధేయతతో దఫేదార్ని "ఫాలో" అయ్యారు.

*　　　*　　　*

అక్కడ——

టాపులేని జీపులో——

ముందు డ్రయివరూ, దఫేదారు——

వెనకపక్క బెంచీ అంత యెత్తుకి పువ్వులు పేర్చారు. ఆ పూలకుప్ప, మెడలో పువ్వులదండతో——

ఏమనిచెప్పను——!....

o　　　o　　　o

జీపు స్టార్టయింది.

వెనకాల కలెక్టరుగారి కారు—

లోపలవారూ. మేడంగారూ.

తరవాత మిగతావాళ్ళ కార్లు, జీపులు-

ఆఖర్ని నా కారు.

స్మశానందాకా "ఫాలో" అవుదామని; ఆ మహోన్నతమైన దహనసంస్కారాన్ని చూసి అక్కడ కలెక్టర్‌గారికి కనబడి, నా సానుభూతినికూడా యధోచితంగా తెలియజెయ్యాలని: వారి అభిమానాన్ని చూరగొనాలని;ఒకటిరెండు నిమిషాలపాటు అనిపించింది, ఆ పరధ్యానంలో కారు నడుపుతున్నాను.

కార్లతో, జీపులతో సాగుతున్న వూరేగింపువల్ల రోడ్డుకి ఎడంవేపునుంచి కుడివేపుకి దాటలేక ఒక కుక్క భయం భయంగా చూస్తూ నిలబడింది; ఇంతలోనే హఠాత్తుగా దాటేద్దామన్న ఆశతో-

పడ్డాది నా కారుకింద.

ఒక్కక్షణం అనిపించింది-

దీన్నికూడా ఆ జీపులో ఆ పూలదిండుమీద పడుకోబెట్టి ఆ గంధపు చెక్కలతో తగలబెట్టిద్దామా అని-

కాని అది "కలెక్టర్‌గారి కుక్క" కాదు....

దాన్ని ఈ ఉదయం ఏ పామూ కరవలేదు—

పాము కరచిన కుక్కకి జిల్లా వెటర్నరీ ఆఫీసర్‌గారు స్వయంగా తన శక్తినంతా ధారపోసి చికిత్స చెయ్యడం-అయినా అది ఆయన చేతులుదాటి పోవడం-దాని శవదహనానికి జిల్లా అధికారులంతా బారులుతీరి వెళ్ళడం-ఎంత గొప్ప దృశ్యం!

ఆ కుక్కగల మనిషికాటుకి జిల్లాలో రెండువేలమంది, తమకు న్యాయంగా రావలసిన ఎనభై లక్షల రూపాయలకి దూరమై, ఆర్నెల్లపాటు అల్లాడిపోవడానికి సిద్ధంగా ఉన్నారు.

అదీ గొప్ప దృశ్యమే మరి.

*